11012025-DIS-04_Layout 1 1/11/2025 3:44 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అమ్మ తప్పిపోయింది

అతను
కరెక్టుగానే చెప్పిండు
మనకే సరిగ్గా అర్థం కాలే
మారుస్తానన్నాడు
అన్నీ మార్చేస్తానన్నాడు
మనమేదో అనుకొని భ్రమపడ్డాం
ఇప్పుడేకంగా తల్లినే మార్చేశాడు!
మన అమ్మ తప్పిపోయింది
ఆమె కిరీటం పోయింది
కంఠాభరణం పోయింది
నడుముకు చుట్టుకున్న
వడ్డాణం మాయమైంది!
మన ఇంటి ఆడపడుచుల ప్రాణదీపమైన
చేతిలోని బతుకమ్మా అదృశ్యమైంది
కరువు కాలం నాటి
జొన్న సజ్జ కంకులు మిగిలిపోయినయ్
దిక్కూ దివాణం లేని
తల్లిని తెచ్చి ముంగట నిలబెట్టి
ఇప్పుడు ఈమెనే మన తల్లి అంటున్నాడు
వెక్కివెక్కి ఏడుస్తూ
మనం కళ్లు నలుముకుంటుంటే
దుఃఖం మొదలైంది ఇప్పుడే కదా
ఇంకో నాలుగేండ్లు గుక్కపట్టండి
అందరికీ తల్లి లేనితనం
అలవాటైపోతది
అడుక్కోవడం నేర్చుకుంటే గాని
అదానీ ఎంగిలి మెతుకుల రుచి
అందరికీ అర్థం కాదంటాడు
అరువు తెచ్చుకున్న అమ్మ
గడిచిన కరువు కాలానికి ప్రతీక!
అమ్మ తప్పిపోయింది
వెతకండిరా వెతకండి
అమ్మ దొరికేదాకా వెతకండి రా!!

కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261

పాలకుడు ఎలా ఉండకూడదంటే?

కేసీఆర్ పాలనలో తెలంగాణ ఒక ఆదర్శం. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర పురోగతిని చూసి ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చి వాలాయి. పురస్కారాలు, ప్రోత్సాహకాలు తలుపుతట్టాయి. కానీ, ఇప్పుడు తెలంగాణ వైఫల్యానికి నిదర్శనం. ఒక్క యాడాదిలోనే తెలంగాణకు అడుగడుగునా అవమానాలు. వేదిక ఏదైనా చీదరింపులు, ఛీత్కారాలు తప్పడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పాలకుడు అంటే ఇలా ఉండాలని నాడు కేసీఆర్ ఉదాహరణగా నిలవగా.. పాలకుడు ఇలా ఉండొద్దని నేడు రేవంత్‌ను ఉదహరించే పరిస్థితి వచ్చింది.

ఓ నరసింహారెడ్డి
80080 02927

తెలంగాణలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అసలు రాష్ట్రంలో పాలన ఉన్నదా? అనే అనుమానం కలుగుతున్నది. దోపిడీ, దౌర్జన్యం, దాడులు తప్ప కాంగ్రెస్ పాలనలో మరొకటి కనిపించడం లేదు. రాష్ట్రంలో పాలన పూర్తిగా పడకేసింది. హామీల అమలు సంగతి దేవుడెరుగు, కనీసం విద్యార్థులకు మూడు పూటలా మంచి భోజనం పెట్టే పరిస్థితి కూడా కనిపించడం లేదు. పేదల ఇండ్లపైకి జేసీబీలు, ప్రతిపక్ష నాయకుల ఇండ్లపైకి ఏసీబీ నోటీసులు పంపించడానికి రేవంత్ సర్కార్ తాపత్రయపడుతున్నది. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కక్ష సాధింపే లక్ష్యంగా రేవంత్ సర్కార్ ముందుకు సాగుతున్నది.

ఏ ప్రభుత్వానికైనా మొదటి ఏడాది కాలం చాలా కీలకం. తొలి ఏడాదిలో ఎంచుకునే మార్గాన్ని బట్టే చేరుకునే లక్ష్యం ఉంటుంది. ఈ ఐదేండ్ల కాలంలో కాంగ్రెస్ లక్ష్యం ఏమిటనేది వారి మొదటి ఏడాది పాలన చెప్పకనే చెప్పింది. అధికారంలోకి వచ్చిన మొదట్లో కాళేశ్వరం, విద్యుత్తు కమిషన్ల పేరిట కక్ష సాధింపు వైపు వడి వడిగా అడుగులు వేసిన కాంగ్రెస్ సర్కార్.. నేడు 'ఫార్ములా-ఈ' కార్ రేసుపై స్వారీ చేస్తూ తెలంగాణ విధ్వంసం దిశగా పరుగులు పెడుతున్నది. రాజకీయ ప్రేరేపిత కేసును ముందటేసుకుని సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్.. దానివల్ల తెలంగాణకు జరిగే నష్టాన్ని విస్మరిస్తున్నది. ఇప్పటికే ఏడాది కాలంగా పెట్టుబడుల్లేక, పరిశ్రమలు రాక పడకేసిన రాష్ట్ర ప్రగతిని కాంగ్రెస్ పూర్తిగా పండబెడుతున్నది. 'ఫార్ములా- ఈ' లాంటి అంతర్జాతీయ ఈవెంట్‌పై బురదజల్లి కక్షసాధింపులకు దిగితే పెట్టుబడులు రావనే కనీస ఇంగితజ్ఞానం పాలకులకు లేకపోవడం శోచనీయం.

తెలంగాణలో ఇంతటి విధ్వంసం జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం కనీసం పట్టించుకోకపోవడం విడ్డూరం. గతంలో కాంగ్రెస్ పార్టీ తమ ముఖ్యమంత్రులపై పెత్తనం చెలాయించేది. కానీ, నేడు ఆ పరిస్థితి లేదు. ఆ పార్టీ ముఖ్యమంత్రులే అధిష్ఠానం మెడలు వంచి స్వారీ చేస్తున్నారు. అందుకే ఆ పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాలు సర్వనాశనం అవుతున్నా కనీసం ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. వారు ఆయా రాష్ట్రాలను నాశనం చేయడమే కాదు, కాంగ్రెస్ పార్టీని కూడా సర్వనాశనం చేస్తున్నారు. ఈ విషయంలో మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి కంటే ముందున్నారు.

తెలంగాణలో సర్కార్ వైఫల్యాలు కాంగ్రెస్‌కు ఇతర రాష్ట్రాల్లోనూ నష్టాన్ని చేకూరుస్తున్నాయి. ఇప్పటికే పక్కనున్న మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణలో అమలుకాని హామీలను ప్రచారం చేసి కాంగ్రెస్ చేతులు కాల్చుకున్నది. ఇప్పుడు రేవంత్ సర్కార్ హామీల వైఫల్యం సెగ ఢిల్లీని తాకింది. ఇటీవల రైతు భరోసాలో మోసం చేసిన తీరుపై ఏఐసీసీ కార్యాలయం వద్ద పోస్టర్లు కలకలం సృష్టించాయి. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు తెలంగాణలో 90 లక్షల మంది మహిళలకు నెలనెలా రూ. 2,500 ఇస్తున్నట్టు చెప్పి ఆ పార్టీకి మరింత నష్టం చేశారు. కాంగ్రెస్ ఇస్తున్న వారెంటీ లేని గ్యారెంటీలు, రేవంత్ సర్కార్ వైఫల్యం గురించి ఇప్పుడు ఢిల్లీ ఓటర్లకు కూడా తెలిసిపోయింది. ఇప్పటికే మహారాష్ట్రలో ప్రచారం చేసి కాంగ్రెస్‌ను ఓడించిన రేవంత్ ఇప్పుడు ఢిల్లీలో కూడా ఆ పార్టీ ఓటమికి బాటలు పరిచారు.

రేవంత్ ప్రభుత్వం వైఫల్యాలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర ముఖ్యమంత్రుల పాలనా తీరు కారణంగా ఇండియా కూటమిలోనూ ముసలం మొదలైంది. కాంగ్రెస్ వల్ల తమకు నష్టమే తప్ప ఎలాంటి లాభం లేదని కూటమిలోని ఇతర పక్షాలు గ్రహించాయి. అందుకే కాంగ్రెస్‌ను దూరం పెట్టేందుకు ఆయా పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే మమతా బెనర్జీకి ఇండియా పగ్గాలు అప్పగించాలని డిమాండ్లు వస్తుండగా.. ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే తమ పీఠం కూకటివేళ్లతో సహా కదలడం ఖాయమని భావిస్తున్న ఆప్ ఆ పార్టీని దూరం పెట్టేసింది. ఇక అక్కడ కాంగ్రెస్ పోరాడేది డిపాజిట్ల కోసమే అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

పదవిలో ఉన్నంత మాత్రాన మన పేరు చిరస్థాయిగా నిలిచిపోదు. కేసీఆర్ పేరును చెరిపేస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్ నేడు తన పేరు ను అందరికీ గుర్తు చేయాల్సిన పరిస్థితికి వచ్చా రు. మనం చేసే పనులే మనకు పేరును తెచ్చి పెడతాయి. అవి మంచి పనులా? మందిని ముంచే పనులా? అనేది రేవంత్ ఇకనైనా నిర్ణయించుకోవాలి. లేకపోతే పాలకుడు ఇలా ఉండకూడదు అన్నదానికి శాశ్వత ఉదాహరణగా ఆయన పేరు చరిత్రపుటల్లో నిలిచిపోవడం ఖాయం.

ఈ జీవోలు అనుకూలమా.. ప్రతికూలమా?

ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలుగా జీవోలను ప్రభుత్వాలు విడుదల చేయడం పరిపాటి. అవే జీవోలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొని వాటిని రద్దుచేసి రాజ్యాంగ పరిరక్షక కేంద్రాలుగా నిలుస్తున్నాయి. గ్రూప్-1 నియామక ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 29తో పాటు వికలాంగుల రిజర్వేషన్ల అమలుకు గాను తెచ్చిన జీవో 96 వివాదాస్పదంగా మారాయి.

జీవో 29, జీవో 96 విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు పూర్తి స్థాయిలో సమగ్ర పరిశీలన చేయకుండానే ఆలస్యమనే కారణంతో ఆ పిటిషన్లను కొట్టివేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది. కాగా, ఇప్పటికే జీవో 130 మీద వెలువరించాల్సిన ఏదో ఒక తీర్పు వాయిదాల పర్వంగా మారిందని రాజ్యాంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ జీవోల రాజ్యాంగ నిబద్ధతను ఒకసారి పరిశీలిద్దాం! 2022లో వేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల వారీగా కేటాయింపు చేయబడిన పోస్టులను భర్తీ చేసేందుకు గాను గత ప్రభుత్వం జీవో 55ను తీసుకువచ్చింది.

పలు అనివార్య కారణాల వల్ల ఆ నోటిఫికేషన్‌ను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వం 2024, ఫిబ్రవరిలో కొత్త నోటిఫికేషన్ ఇచ్చింది. దానిలో పేర్కొన్న జీవో 29 ద్వారా ప్రిలిమ్స్ స్థాయిలో రిజర్వేషన్లను పాటించకుండా కేటాయించిన పోస్టులకు తగిన అభ్యర్థులు లేనప్పుడు ఆయా రిజర్వేషన్ అభ్యర్థులను అదనంగా మెయిన్స్‌కు ఎంపిక చేశారు. అంటే ఓపెన్ కేటగిరీలో అర్హత సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులు ఓపెన్ కేటగిరీ అభ్యర్థులుగా కాకుండా రిజర్వేషన్ అభ్యర్థులుగానే పరిగణించబడుతున్నారు. కానీ, సౌరవ్‌యాదవ్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఇది చెల్లుబాటు కాదు. కానీ ప్రభుత్వ వర్గాలు మాత్రం చివరి ఎంపిక ప్రక్రియలోనే రిజర్వేషన్లను పాటిస్తామని కోర్టుకు విన్నవిస్తూ వచ్చారు. అన్ని స్థాయిలలో రిజర్వేషన్లను అమలుచేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీం తీర్పునిచ్చింది. దీనిప్రకారం ప్రభుత్వ వాదనను నిర్ద్వంద్వంగా తోసి పుచ్చవచ్చు. కానీ, జీవో 29 మీద దాఖలైన వివి ధ పిటిషన్లను సాంకేతిక కారణంతో హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. దీంతో ఆ జీవో 29 వివాదం ఇప్పుడు మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. అత్యున్నత న్యాయస్థానం అందులోనూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి వెళ్తుండటం వల్ల ఈ కేసు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు దేశవ్యాప్తంగా వర్తించడమే కాకుండా, రిజర్వేషన్ ప్రక్రియపై పెను ప్రభావాన్ని చూపనున్నదని పరిశీలకులు అభిప్రాయం.మహిళా రిజర్వేషన్లతో పాటు స్పోర్ట్స్ కోటాను, వికలాంగుల కోటాను కూడా సమానంగానే భర్తీ చేయాలని 2007లో రాజేష్ కుమార్ దారియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తెలంగాణ ప్రభుత్వం పలు ఉద్యోగాల భర్తీలో భాగంగా వికలాంగుల కోటాను అమలుపరిచే ఉద్దేశంతో జీవో 96 తెచ్చింది. దీనిప్రకారం, వికలాంగుల కోటా భర్తీ విధానం హారిజాంటల్‌గా కాకుండా వర్టికల్‌గా ఉన్నది.

ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఉన్నది. ఈ విషయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సైతం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో డిస్మిస్ కావడంలో అంతర్యం ఏమిటని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 2022లోవెలువడిన అన్ని నోటిఫికేషన్లలో మహిళా రిజర్వేషన్లను కూడా వర్టికల్‌గానే ఇచ్చినప్పటికీ రాజేష్‌కుమార్ దారియా కేసులో ఇచ్చిన తీర్పు మేరకు ఆ రిజర్వేషన్లను వర్టికల్‌గా కాకుండా హారిజంటల్‌గా మార్చారు. అదే సమయంలో వికలాంగుల కోటానూ హారిజాంటల్‌గానే భర్తీ చేయవలసి ఉన్నా జీవో 96 ద్వారా వర్టికల్ విధానంలోనే అమలుపరుస్తున్నారు.

ఇక ఎస్టీ రిజర్వేషన్ పెంపు కోసం తెచ్చిన జీవో-130 కూడా వివాదాస్పదంగా మారింది. ఎస్టీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియ పార్లమెంటు సవరణ అనంతరం రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడిన తర్వాత మాత్రమే అమలుకు నోచుకుంటుంది. అంతేకాకుండా, ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనేది నిబంధన. 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా కోటా 50 శాతం కోటా దాటుతున్నది. రిజర్వేషన్ పెంపు ప్రక్రియ అనేది జీవో ద్వారా సాధ్యం కాదనేది అటు రాజ్యాంగ నిపుణులు ఇటు న్యాయకోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవో-130 మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు ఏడాది పాటు వాయిదాలతోనే సాగిపోతూ ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను పరిశీలించడంతో పాటు, రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమే పరిష్కారం చూపాలని అభ్యర్థులు ఆశిస్తున్నారు.

పైన పేర్కొన్న జీవోలపై దాఖలైన పలు పిటిషన్లను కోర్టులు సాధ్యమైనంత త్వరగా పరిశీలించి సమగ్ర అధ్యయనం చేసి రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుకూలంగా ఉన్నాయా? లేక ప్రతికూలంగా ఉన్నాయా? అనే విషయాన్ని తేల్చుతూ విరుద్ధంగా ఉన్న వాటిని కొట్టివేసి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ప్రక్రియను రక్షించాలని కోరుతున్నారు. ఆ గురుతర బాధ్యత న్యాయస్థానాలపై ఉన్నదని, సామాన్యునికి సైతం న్యాయవ్యవస్థ బాసటగా నిలుస్తూ విశ్వాసాన్ని పాదుగొలుపుతుందని అటు ఉద్యోగార్థులు, ఇటు న్యాయ నిపుణులు రాజ్యాంగ, పరిరక్షకులు ఆశిస్తున్నారు.

భాస్కర్ యలకంటి
89194 64488
(వ్యాసకర్త: సోషల్ ఎనలిస్ట్)

విపక్షాలను వేధించడంలో దొందూ దొందే!

ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టి వేధించడంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ఒకే గూటికి చెందిన పక్షులు. ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేయడంలో ఈ రెండు పార్టీలు ఒకేరకంగా వ్యవహరిస్తున్నాయి. బాహ్య ప్రపంచానికి కాంగ్రెస్, బీజేపీలు ప్రత్యర్థులుగా కన్పిస్తున్నప్పటికీ.. ఈ రెండు పార్టీల మధ్య రహస్య బంధం ఉన్నదన్నది మాత్రం 'ఫార్ములా ఈ' రేస్ కేసుతో సంపూర్ణంగా బట్టబయలైంది.

తోటకూర రమేశ్



ఇన్ని రోజులు ఉప్పు, నిప్పులా ఉన్నట్టు నటించి దేశ ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలను మోసం చేసిన రేవంత్‌రెడ్డి, బీజేపీ నేతలు 'ఫార్ములా-ఈ' రేస్ కేసుతో వారి మధ్య ఉన్న చీకటి బంధం బయటపడింది. ఢిల్లీలో బీజేపీకి రేవంత్ రెడ్డి ఏ-టీంగా వ్యవహరిస్తుంటే.. తెలంగాణ బీజేపీ కాంగ్రెస్‌కు బీ-టీంగా వ్యవహరిస్తున్నది. ఇలా పరస్పర ఒప్పందంతో ఈ రెండు పార్టీలు ప్రతిపక్షాలపై రాజకీయ ప్రతీకార చర్యలకు దిగుతున్నాయి. అక్రమ కేసులతో ఇబ్బందుల పాలు చేసే ప్రయత్నం చేస్తున్నాయి.

కేంద్రంలోని అధికారంలో ఉన్న బీజేపీ వాషింగ్ పౌడర్ నిర్మా స్కీమ్‌తో విపక్షాలను కంట్రోల్‌లో పెట్టుకుంటున్నది. తమకు కొరుకుడు పడని నేతలను సామ దాన భేద దండోపాయాలతో లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నది. బీజేపీ ఒత్తిడికి తల వంచని వారిపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి, దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏసీబీతో విపక్షాలపై కక్ష సాధింపు రాజకీయాలు చేస్తున్నారు. రాజ్యాంగ వ్యతిరేక పాలన చేస్తున్న బీజేపీ.. ప్రశ్నిస్తున్న జర్నలిస్టులు, ప్రజాస్వామ్య వాదులపై చీటికిమాటికి కేసులు పెడుతూ జైల్లో వేస్తున్నది. కాషాయ పార్టీ బాటలోనే ఇప్పుడు రేవంత్‌రెడ్డి నడుస్తూ కాంగ్రెస్ చట్ట వ్యతిరేక పాలనపై ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారు.

జాతీయ స్థాయిలో విపక్షాలపై దర్యాప్తు సంస్థలతో కేసులు పెట్టి వేధించడంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ దొందూ దొందే అని నిరూపించుకున్నాయి. దేశంలో తమను వ్యతిరేకించే చిన్న పార్టీలను రాజకీయంగా బతికి బట్టకుండా చేసి అవి కోలుకోకుండా దారుణంగా దెబ్బతీస్తున్నాయి. అయితే, దశాబ్దకాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాలు విచారణ సంస్థల కంటే ముందే దర్యాప్తులోని కీలక అంశాలు మీడియాకు లీక్ చేస్తున్నారు. కేసు బలహీనమవుతున్న ప్రతి సందర్భంలో విచారణ సంస్థల దగ్గర ఉండాల్సిన సమాచారం లీక్ చేస్తున్నారు. గతంలో ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఈడీ విచారణకు ముందే బీజేపీ వీడియో విడుదల చేసింది. కేజ్రీవాల్, సిసోడియా అరెస్టవుతారని కాషాయ నేతలు ముందే చెప్పారు. తెలంగాణలో కూడా కవిత అరెస్టవుతారని ఈడీ అధికారుల కంటే ముందే బండి సంజయ్ చెప్పారు. బీజేపీ నేతలు ఏ అంశాలైతే లేవనెత్తారో, ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ విచారణలో అవే అంశాలను బయటపెట్టడం గమనార్హం. విపక్ష నేతలను అరెస్ట్ చేసి నెలల తరబడి జైల్లో పెట్టి పెట్టి ఆనందించారు.

తాజాగా 'ఫార్ములా ఈ' రేస్ కేసులో కూడా అధికార పార్టీ నేతలు కేసును ప్రభావితం చేసేలా ప్రకటనలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్ట్ చేయాలన్న దృఢ సంకల్పంతో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలహీనమైన కేసును క్లిష్టంగా మార్చేందుకు అనూహ్యంగా ఎలక్టోరల్ బాండ్స్ అంశాన్ని ముందుకు తెచ్చారు. కేటీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ మంత్రులు, నేతలు పోటీలుపడి మరీ తీర్పులు చెప్పేస్తున్నారు. అసలు 'ఫార్ములా ఈ' రేస్ కేసుకు, ఎలక్టోరల్ బాండ్స్‌కు సంబంధం లేదు. అయినా కేసును మరింత జఠిలం చేసేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా తప్ప ఇది మరోటి కాదు. 'ఫార్ములా ఈ' రేస్ కేసులో ఏదో జరిగిందని, కేటీఆర్‌కు ఏదో ప్రయోజనం చేకూరిందని కోర్టును నమ్మించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎంత కక్షతో ఉన్నదంటే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ వేస్తారని తెలిసి ముందే తెలంగాణ ప్రభుత్వం కేవియెట్ పిటిషన్ వేసింది. నిజంగానే ఫార్ములా ఈ కేసులో క్విడ్ ప్రో కో జరిగి ఉంటే బాధితుడి కంటే ముందే ప్రభుత్వం కేవియెట్ పిటిషన్ వేయాల్సిన అవసరం లేదు. తప్పు జరిగితే సుప్రీం కోర్టు కూడా న్యాయం చెప్తుంది. అయితే అంతకంటే ముందే కేటీఆర్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని కేవియెట్ వేసినట్టు స్పష్టంగా అర్థమవుతున్నది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రతీకార చర్యలు రాజ్యాంగ ఉనికిని దెబ్బతీస్తాయి. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం.

జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రాంతీయ పార్టీలను కనుమరుగు చేసేందుకు గాను వేయని ఎత్తులు లేవు. అందులో భాగంగానే అటు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇటు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రకరకాలుగా పన్నాగాలు పన్నుతూనే ఉంటాయి. అయితే పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు కలిగిన ఈ పార్టీలు ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే ఆ సిద్ధాంతాలను మరిచిపోయి 'నాకు నువ్వు, నీకు నేను' అన్నట్టుగా చెలిమి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే కేంద్రంలోని బీజేపీకి తెలంగాణ ముఖ్యమంత్రి చాటుగా సహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందుకే ఆయన ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి బీజేపీకి చెందిన కేంద్ర మంత్రులను కలుస్తారనే విషయం తెలిసిందే. అయితే జాతీయ పార్టీలు ఎన్నిరకాల కుయుక్తులు చేసినా ప్రాంతీయ పార్టీలను కనుమరుగు చేయడం అసాధ్యమనే విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిది.

(వ్యాసకర్త: ఫ్రీలాన్స్ జర్నలిస్టు)

జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రాంతీయ పార్టీలను కనుమరుగు చేసేందుకు గాను వేయని ఎత్తులు లేవు. అందులో భాగంగానే అటు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇటు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రకరకాలుగా పన్నాగాలు పన్నుతూనే ఉంటాయి. అయితే పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు కలిగిన ఈ పార్టీలు ప్రాంతీయ పార్టీల విషయానికి వస్తే ఆ సిద్ధాంతాలను మరిచిపోయి 'నాకు నువ్వు, నీకు నేను' అన్నట్టుగా చెలిమి చేస్తున్నాయి.



హిందీ జాతీయ భాష కాదు

హిందీ, ఇంగ్లిష్, తమిళ భాషలు ఎంతమందికి అర్థమవుతాయి. నేను మీకో విషయం చెప్పాలనుకుంటున్నాను. హిందీ మన జాతీయ భాష కాదు, అది మన అధికారిక భాష మాత్రమే.

- రవిచంద్రన్ అశ్విన్
భారత మాజీ క్రికెటర్